


కరవద్దు!

అదొక అడవి. ఆ ఊరికీ ఈ ఊరికీ మధ్యనుంది. అక్కడి వాళ్ళు ఇక్కడికి రావాలన్నా, ఇక్కడివాళ్ళు అక్కడికి వెళ్ళాలన్నా ఆఅడవిదాటాలి. ఆ అడవిలో సింహాల్లేవు, పులుల్లేవు. ఉన్నదల్లా ఒకే ఒక్కపాము. కంట బడితే కాటు వేస్తుంది. కాటు వేసిందో ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసి పోవాలసిందే. ఆ విధంగా ఆ పాము ఎందరొన్నో కైలాసం పంపించింది. ఈ పాము పీడ రెండూళ్ళ వాళ్ళకీ గొప్ప బాధగానూ, భయంగానూ వుంటోంది.

ఒక మహర్షి అడవిలో అడుగు పెట్టేడు. ఎట్లా పసిగట్టిందో ఏమో గబగబా ఎదురొచ్చింది పాము. బుస్సున నిలువెత్తు లేచింది. కాటందుకోవ దానికి సిద్ధపడగా మహర్షి ఒక మందహాసం విసిరేడు. ఆ మందహాసంలో

ఏం మందుందోగాని పాము తల దించేసింది. తన పవర్ తగ్గిపోయినట్టు తోచింది. ఏమిటిది స్వామీ నన్నేం చేసేరు మీరు. నేనెందుకిట్లా వాన పామునై పోయేనంటూ కంట తడి పెట్టుకుని అడిగింది. మహర్షి మళ్ళా మంద హాసం చేసేడు. పామా, నీ దుర్మార్గం నన్నేం చేయలేదు. అదట్లా వుంచు. గత జన్మలో నువ్వేం పాపం చేసుకున్నావోగానీ పురుగువై ....విషప్పురుగువై ఈ జన్మనిట్లా లాగిస్తున్నావు. ఈ జన్మలో కూడా బీభత్సాలు చేసుకుంటూ పోతే వచ్చే జన్మలో మరింత నికృష్టంగా బతుకుతావోనని దిగులుగా వుంది. నిన్ను ఆ దేవ దేవుడే ఆదుకోవాలి సుమా అన్నాడు. పాము వల వలా ఏడ్చింది. దీనికి తరుణోపాయం లేదా స్వామీ అని అడిగింది. ఎందుకు లేదు, వుంది. కనీసం ఈ జన్మలో నైనా కరవకుండా బుద్ధిగా వుంటే వచ్చే జన్మకి మంచి పుట్టుకే పుట్టవచ్చని హితబోధచేసి వెళ్ళిపోయేడు స్వాముల వారు.

స్వామీజీ చేసిన హితబోధ పాము తలకి బాగా ఎక్కింది. ఆ రోజు నుంచీ నే నెవర్నీ కరవనని బోర్డు కట్టుకుంది. ఈ సంగతి రెండు వూళ్ళకీ తెలిసింది. వాళ్ళంతా ఎంతో సంతోషించి వూరుకోలేదు. పాముకి కొత్తగా అలవడిన సాధుస్వభావం ప్రజలకు అలుసైపోవడం వల్ల దాని మీద రాళ్ళు రువ్వడం ప్రారంభించేరు. చేతితో తిప్పి తిప్పి విసురుతున్నారు. పాము వాళ్ళకి బొత్తిగా ఆట వస్తువై పోయింది. ఆహారం లేదు. ఆందరికీ ఆస్టరాలై పోయింది. చిక్కి శల్యమై పోయింది. కళ్ళల్లో ప్రాణం పెట్టుకుని బతుకుతుంది. మహర్షి మళ్ళా అడవిలో కాలు పెట్టాడు. మహాప్రభో అంటూ పాము మహర్షి కాళ్ళని చుట్టేసుకుంది. పాము అవతారాన్ని, దాని దుస్థితిని అర్థం చేసుకున్నాడు మహర్షి. పాము అవివేకానికి ఎంతో జాలిపడ్డాడు. ఓసి పిచ్చిపామా....నిన్ను కరవద్దని చెప్పేనేకానీ బుసకొట్టద్దని చెప్పలేదే నిన్ను నువ్వు రక్షించుకోవాలంటే బుసకొట్టాలి, భయపెట్టాలి. నీయందు పరులకు భయభక్తులుండాలి. ఈ సూత్రం ఫాలో అయి బతకమని చెప్పి వెళ్ళిపోయేడు.

సరిగమల్లో పిట్టకథ లేమిట్నాయనా అని విసుక్కోవద్దు. ఆ మాట కొస్తే ఇది పిట్టకథ కానేకాదు. హవ్ టు లివ్వనే నీతికిది జాతి కథ.

మంచికైనా, చెడుకైనా హద్దులుండాలి అని పెద్దలు చెప్పేరు. మంచి తనం మంచిదే గాని అతి మంచితనం దుర్మార్గం కంటే చెడ్డది. అతి మంచి తనంమనిషిని ఇబ్బంది పెడుతుంది. నవ్వుల పాలు చేస్తుంది. వట్టి దద్దమ్మని ముద్ర వేస్తుంది. బ్రతుకుని నరకప్రాయం చేస్తుంది.

తండ్రి బిడ్డ దగ్గరా....మేష్టారు విద్యార్థి ముందూ....బాసు సబార్డి నేటుతోనూ, పోలీసు నేరస్థుడితోనూ వ్యవహరించేప్పుడు ఈ సూత్రాల్ని తప్పకుండా గుర్తుంచుకోవాలి. నిత్య జీవితంలో ప్రతి మనిషి, మరో మనిషి దగ్గర ఈ మేజిక్కులు చేస్తుండాలి. మనం మంచిగా వుంటే సరిపోదు. మనల్ని మనం దుష్టుల నుంచి, దుర్మార్గుల నుంచి కాపాడు కొనేందుకు ప్రయత్నించాలి. మంచి వాడని పించుకోవాలని అందరికీ ఉంటుంది. అందుకు కొన్ని పిచ్చి పనులు చేస్తూ మంచిని నటిస్తుంటాం. దాంతో మన గాలి తీస్తారు. ఢాం ఢీం అనక పోతే చెల్లుబడి కాలేం. అంతేగాని నేను పరమ గంగిగోవునని బోర్డు కట్టుకుంటే ఇంకంతే సంగతులు.

మన ముక్కు పచ్చడి చేయడానికి అవతలి వాడు సిద్ధపడినప్పుడు.... మన దగ్గర శక్తి వున్నా, లేకపోయినా....నీ నెత్తురు తాగుతా జాగ్రత్తని దబాయించాలేగాని తమ చిత్తమంటే మనల్ని కూరొండుకు తినేస్తారు. ఈ మధ్య నాకిలాంటి గొడవే జరిగింది. ఒక నాటకం రాసేను. విన్నవాళ్ళు బాగుందన్నారు. ప్రదర్శన చూసిన వాళ్ళు కూడా బాగానే వుందన్నారు. ఇంతమందీ మెచ్చుకుంటున్నారు గదా అని వినయం నటించడం మొదలు పెట్టేను.

అతి వినయం స్టేజీలో వుండగా ఒకతను నా మీద విరుచుకు పడి పోయేడు. సదరు ఆ వ్యక్తి కూడా రచయితేగాని అజ్ఞాతంగా వుండిపోయేట్ట. తాను రాసినవి అచ్చు వేసే దుమ్ము తెలుగు పత్రికలకు లేదని గాంఢ్రించేడు. అందుకే రాసుకున్నవన్నీ దాచుకున్నానని ఉద్ఘాటించేడు. భళి భళి యని పొగి డేను. దాంతో అతను మరింత రెచ్చిపోయేడు. నేను రాసినవన్నీ చచ్చు

నాటకాలన్నాడు. నాకు ఉరిశిక్ష వేయాలన్నాడు. రచనా శిల్పానికి తీరని ద్రోహం చేస్తున్నా నన్నాడు. లక్షా తొంభై రకాలుగా తిట్టి వెళ్ళి పోయాడు. వినయం నటిస్తుండడం వల్ల నేను నోరెత్తలేక పోయాను.

అతను వెళ్ళి పోయిం తరువాత ఘొల్లున ఏడ్చాను. అప్పుడొచ్చేడు ఫ్రండు. నేనెందుకు కేడుస్తున్నానో అడిగి తెలుసుకున్నాడు. నన్ను ఓదార్చడం పోయి వాడు కూడా తిట్టడం ప్రారంభించేడు. నువ్వు ఫూల్వి, బఫూన్వి. వాడంత తిడుతుంటే తలొంచుకుని వినడం తప్పు. వాడి డొక్కలో పొడవాల్సింది. హింసాత్మక చర్యలమీద నీ కింటరెస్టు లేకపోతే వాడ్ని నిలబెట్టి కడగవలసింది. కర్త, క్రియలు లేకుండా చదవబుల్గా వుండే వుత్తరం పదిహేను పైల్లు రాసి చూపించరా సన్నాసీ! నీ పవరేమిటో నేను చెబుతానని ఎదురు తిరగాల్సింది. వాల్మీకి రామాయణాన్ని లక్షసార్లు విమర్శించేను. తెలుసాని కాలరెత్తాల్సింది. మాటకి మాటకి మాట చెప్పలేని వాడివి ఏడుస్తూ కూచోడం కంటే ఎండ్రిన్ తాగడం బెటరంటూ నన్ను దెప్పి పొడిచేడు. నిజమే, కరవకపోతే మానే బుసలైనా కొట్టాలి. లేకపోతే బతకనీదు పాడు ప్రపంచం.